# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ:  22-08-2024      సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్ ఘటనపై ఉన్నత స్థాయి విచారణ కమిటీని వేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు.
- అచ్యుతాపురం ఫార్మా సెజ్‌లో జరిగిన ప్రమాదఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.
- రాష్ట్రంలో 13 వేల 326 గ్రామ పంచాయతీలలో రేపు గ్రామసభలను నిర్వహిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ తెలిపారు.
- పేదలందరికీ  ఇళ్ళ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించారు.
- ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 113వ సంచిక ఈ ఆదివారం ప్రసారమవుతుంది.

========================

అనకాపల్లి జిల్లా  అచ్యుతాపురం సెజ్ లో రియాక్టర్ పేలుడు ఘటనపై ఉన్నత స్థాయి విచారణ కమిటీ వేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఈ రోజు విశాఖలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులను సందర్శించి ఈ ఘటనలో తీవ్రగాయాలపాలైన బాధితులను పరామర్శించారు. వారి ఆరోగ్య వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

అదే విధంగా అచ్యుతాపురం సెజ్‌లో ప్రమాదం చోటు చేసుకున్న ఫార్మా పరిశ్రమను కూడా ముఖ్యమంత్రి పరిశీలించారు. అనంతరం పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ, కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా బాధ్యులపైన చర్యలు తీసుకుంటామని, రాష్ట్రంలోని పరిశ్రమలలో భద్రతాపరమైన చర్యలను శాశ్వత ప్రాతిపదికన చేపడతామని తెలిపారు. పరిశ్రమలలో భద్రతాపరమైన ఆడిట్  తప్పనిసరి అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రెడ్ కేటగిరీలోని పరిశ్రమలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. గత 5 సంవత్సరాల్లో విశాఖలో 119 ఘటనల్లో 120 మంది మృతి చెందడం బాధాకరమని చంద్రబాబు నాయుడు పేర్కొంటూ...

(వాయిస్ 24 సెకన్లు)

=======================

ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఫార్మా సెజ్‌లో నిన్న జరిగిన అగ్ని ప్రమాదంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు ప్రధానమంత్రి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మృతుల కుటుంబాలకు ప్రధానమంత్రి సహాయ నిధి నుంచి పరిహారం అందిస్తామని ప్రకటించారు. మృతుల కుటుంబాలకు 2 లక్షల రూపాయల చొప్పున, గాయపడిన వారికి 50 వేల రూపాయల చొప్పున పరిహారం అందిస్తామని నరేంద్రమోదీ పేర్కొన్నారు.

=======================

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రంలో రేపు 13 వేల 326 గ్రామ పంచాయతీలలో గ్రామసభలను నిర్వహిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో ఈ రోజు పాత్రికేయులతో మాట్లాడుతూ, గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో చేయాల్సిన పనులపై చర్చించేందుకు గ్రామ సభలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ గ్రామసభలలో యువతతో పాటు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పవన్ కల్యాణ్ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

=======================

రాష్ట్రంలో పేదలందరికీ ఇళ్ళ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గంలో ఈ రోజు ఆయన పర్యటించారు. కాలనీలో నిర్మాణంలో ఉన్న గృహాలను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వంద రోజుల్లో 1 లక్షా 25 వేల గృహాలు, వచ్చే సంవత్సరంలో రాష్ట్రంలో 7 లక్షల ఇళ్లు నిర్మించాలన్నది ప్రభుత్వ ఉద్దేశ్యమని తెలిపారు. ప్రభుత్వ అంచనా ప్రకారం రాష్ట్రంలో ఇళ్లు లేని పేదలు 11 లక్షల మంది ఉన్నారని.. వారందరికీ ఇళ్లు నిర్మిస్తామన్నారు. అలాగే, అర్బన్ ప్రాంతాల్లోని కాలనీలలో మౌలిక సదుపాయల కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి అమృత్ పథకంలో నిధుల సేకరణతో పాటు, రూరల్ ప్రాంతాల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్), జల్ జీవన్ మిషన్ నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం తన వాటా అందిస్తుందని మంత్రి పార్థసారథి తెలిపారు.

=======================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 113వ సంచిక ఈనెల 25వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్' కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్ కు రేపు సాయంకాలం వరకు పంపవచ్చు.

విరామం

=======================

రాష్ట్రంలో పలువురు మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేస్తూ... ప్రభుత్వం ఈ రోజు ఉత్తర్వులను జారీ చేసింది. 24 మంది మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేస్తున్నట్లు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్

సింఘాల్ ఆ ఉత్తర్వులలో పేర్కొన్నారు. పలువురు కమిషనర్లను మాతృశాఖకు ప్రభుత్వం బదిలీ చేసింది. అలాగే, మరికొంతమంది కమిషనర్లను మున్సిపల్ శాఖ డైరెక్టర్‌కు రిపోర్ట్ చేయాలని ఆదేశించింది.

========================

రాష్ట్రంలో బయో సింథటిక్ ఉడ్ తయారీ యూనిట్ హైడ్రో ఫోయిల్ పడవలు తయారు చేసే కంపెనీని స్థాపించేందుకు ఏరియల్ గ్లోబల్ సింగపూర్ అండ్ స్పెయిన్ సంస్థ ముందుకు వచ్చింది. ఈ కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంపత్ కుమార్ రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలశాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిని అమరావతిలోని సచివాలయంలోని ఈరోజు కలిశారు. రాష్ట్రంలో 300 కోట్ల రూపాయలు  పెట్టుబడి పెట్టేందుకు సిద్ధంగా ఉన్నామని సంపత్ కుమార్ తెలిపారు. అధునాతన టెక్నాలజీతో హైడ్రో ఫోయిల్ పడవలను తమ సంస్థ తయారు చేస్తుందని మంత్రికి వివరించారు. దీనిపై మంత్రి జనార్ధన్ రెడ్డి స్పందిస్తూ... ఈ విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని తెలిపారు.

========================

వారధి కార్యక్రమం పేరుతో ప్రజాప్రతినిధులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే కార్యక్రమం భారతీయ జనతా పార్టీ చేపట్టిందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో వారధి కార్యక్రమంలో మంత్రి ఈ రోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడారు.

========================

అనకాపల్లి జిల్లా, కైలాసపట్టణంలోని అనాధాశ్రమంలో ఇటీవల కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురై విశాఖలోని కేజీహెచ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు పరామర్శించారు. చిన్నారుల ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులు కోలుకునేంత వరకూ వారి ఆరోగ్య భధ్యత ప్రభుత్వమే వహిస్తుందని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు హామీ ఇచ్చారు.

========================

ఆంధ్రప్రదేశ్, యానాంల మీదుగా దిగువ ట్రోపో ఆవరణంలో  నైరుతి, పడమటి గాలులు  వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. రాబోయే మూడు  రోజులలో ఉత్తర కోస్తా జిల్లాలలో తేలికపాటి నుండి మోస్తరు వర్షం లేదా ఉరుములతో  కూడిన జల్లులు కొన్ని చోట్ల  కురిసే అవకాశముందని పేర్కొంది. అలాగే, భారీ వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని తెలిపింది. దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాలలో తేలికపాటి నుండి మోస్తరు వర్షం, లేదా ఉరుములతో  కూడిన జల్లులు కొన్ని చోట్ల  కురిసే అవకాశముందని వివరించింది. అలాగే, బలమైన గాలులు గంటకు ౩౦ నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఒకటి లేదా రెండు చోట్ల వీచే అవకాశముందని వాతావరణ కేంద్రం పేర్కొంది.

========================

తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా పలు ఆర్జిత సేవలు, విరామ దర్శనాలు, వివిధ ప్రత్యేక దర్శనాలను అక్టోబరు 3 నుండి 12వ తేదీ వరకు రద్దు చేశామని తిరుమల తిరుపతి దేవస్థానం టీటీడీ ఈరోజు ఒక ప్రకటనలో తెలిపింది. శ్రీవారి బ్రహ్మోత్సవాలలో స్వామివారి వాహనసేవలు వీక్షించేందుకు సామాన్య భక్తులు సాధారణం కంటే అధికంగా వస్తారు. కాబట్టి, వారికి సంతృప్తికరంగా దర్శనం కల్పించేందుకు బ్రహ్మోత్సవాలలో విరామ దర్శనాలు, వివిధ ప్రత్యేక దర్శనాలను రద్దు చేశామని టిటిడి ఆ ప్రకటనలో తెలియజేసింది.

=======================

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలోని సెజ్ లో జరిగిన దుర్ఘటనలో గాయాలపాలై విశాఖలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సి.ఎం.రమేష్, పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు ఈ రోజు పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి సిబ్బందికి సూచించారు.

=======================

పల్నాడు జిల్లాలో రేపు నిర్వహిస్తున్న గ్రామ సభలను విజయవంతం చేయాలని కలెక్టర్ పి.అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. గ్రామసభల నిర్వహణ మీద అధికారులతో జిల్లా కేంద్రమైన నరసరావుపేట కలెక్టర్ కార్యాలయం నుండి శ్రవణమాధ్యమం ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామసభలలో ఆయా మండల ప్రత్యేక అధికారులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టే అభివృద్ధి పనుల  గుర్తింపు - ప్రణాళికా ప్రక్రియను రూపొందించుకునేందుకు గ్రామసభలను నిర్వహిస్తున్నామని తెలిపారు.

=======================

=======================